# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆరోగ్య సంరక్షణలో వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా అరకు కాఫీ దుకాణాలను ఏర్పాటు చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు.
- రాష్ట్ర అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.
- ఉత్తర కోస్తాంధ్రలోని అనేక చోట్ల రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది.

==========================

ఆరోగ్య సంరక్షణలో వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఈరోజు నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అన్ని వృత్తుల కన్నా వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదన్నారు. అటువంటి ఈ వృత్తిలో ఎంపికైన వైద్య విద్యార్థులు ఎంతో అదృష్టవంతులని పేర్కొన్నారు. వైద్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 34 వైద్య కళాశాలలతో పాటు, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని గిరిజన ప్రాంతంలో ఒక నూతన వైద్య కళాశాలను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. విశాఖపట్నంలోని హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్ లో అనస్థీషియాలజీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయడానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గవర్నర్ వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

========================

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో అరకు కాఫీ దుకాణాలను ఏర్పాటు చేయాలని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) అధికారులను మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. ఈరోజు విశాఖపట్నంలోని జీసీసీ కార్యాలయంలో ఆయా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన మంత్రి అరకు కాఫీ ఉత్పత్తుల అమ్మకాలు, దుకాణాల నిర్వహణ, గిరిజన రైతుల సంక్షేమం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అరకు కాఫీకి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, దాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో దుకాణాలు ఏర్పాటు చేసి గిరిజన ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని సూచించారు. జీసీసీ కార్యకలాపాలపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.

========================

రాష్ట్రంలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈరోజు అనంతపురంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... అన్నదాత ఆర్థిక అభివృద్ధికై ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు ఇబ్బందిపడకుండా ప్రభుత్వం ముందుగానే యూరియా, విత్తనాలు, బీమా, మద్దతు ధరలతో సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ కృషితో కేంద్ర ప్రభుత్వం అదనంగా 49,367 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించిందని వెల్లడించారు. రాబోయే రబీ సీజన్‌కు అవసరమైన 9.3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కూడా ముందస్తుగానే కేంద్రప్రభుత్వం ఇప్పటికే కేటాయించిందని మంత్రి అచ్చెన్నాయుడు వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

విశాఖపట్టణం నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని విశాఖ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. 553 కోట్ల రూపాయలతో జీవీఎంసీ జోన్ 2 పరిధిలో భూగర్భ డ్రైనేజ్ కి ఐఎఫ్ సీ తో ఒప్పందం శుభపరిణామమని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో దేశంలోనే తొలిసారి ఐఎఫ్ సీ రుణం పొందిన తొలి కార్పొరేషన్ గా జీవీఎంసీ చరిత్రకెక్కిందన్నారు. ఈ ప్రాజెక్టుతో జీవీఎంసీ జోన్ 2లో 100 శాతం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మోడల్ పంపింగ్, లిఫ్టింగ్ స్టేషన్లు, అత్యాధునిక శుద్ధి కేంద్రం, నీటి పునర్వినియోగం, రీసైక్లింగ్ అందుబాటులోకి వస్తుందన్నారు. విశాఖను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విరామం

========================

GST 2.0 సంస్కరణల పేరుతో వస్తు సేవల పన్నులను తగ్గిస్తూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. GST వసూళ్ళలో గతంలో ఉన్న నాలుగు స్లాబ్స్‌లో 12, 28 శాతం స్లాబ్స్ ను పూర్తిగా ఎత్తివేస్తూ... ఈ నెల 22 నుండి కేవలం 5 శాతం, 18 శాతం అనే రెండు స్లాబ్స్ మాత్రమే కొనసాగించడంపై వినియోగదారులతో పాటు, వ్యాపారస్తులు, వివిధ కంపెనీల ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వస్తు సేవల పన్ను విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తాజా సంస్కరణలు... వినియోగదారుడి కొనుగోలు శక్తిని పెంచడంతో పాటు, వ్యాపారస్తులకు ప్రయోజనకరంగా ఉంటూ.. దేశాభివృద్ధిలో కీలకంగా మారుతుందని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులు, వ్యాపారస్తులు, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాలతో పాటు ఆర్థిక లావాదేవీలు చేసే ప్రతి ఒక్కరికీ భావితరం జీఎస్టీ సంస్కరణలు ప్రయోజనకరంగా ఉంటాయని విశాఖ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి శ్రీనివాసరావు వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

========================

ప్రెస్ కౌన్సిల్ అనే పదాన్ని, సంస్థ చిహ్నాన్ని ఏ ఇతర వ్యక్తులు గానీ, సంస్థలు గానీ  వినియోగించరాదని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యదర్శి డాక్టర్ ధీరజ్ కకాడియ స్పష్టం చేశారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనేది 'ప్రెస్ కౌన్సిల్ చట్టం, 1978 ద్వారా ఏర్పాటు చేసిన సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన చట్టబద్ధమైన సంస్థ అని, దేశంలో పత్రికా స్వేచ్ఛను కాపాడటం, వార్తాపత్రికలు, వార్తా సంస్థల ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశ్యంతో ఏర్పాటయ్యిందని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు రాసిన డిఓ లేఖలో ధీరజ్ కకాడియా తెలియజేశారని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు ఈరోజు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రెస్ కౌన్సిల్ సెక్రటేరియట్ న్యూఢిల్లీలోని సూచనా భవన్ లో మాత్రమే ఉందని.. దీనికి అనుబంధ సంస్థ గాని, ఏ రాష్ట్ర శాఖ లేదని ధీరజ్ కకాడియ ఆ లేఖలో పేర్కొన్నారు.

========================

ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ఈ వ్యాధికి చికిత్స కన్నా నిర్మూలనే ముఖ్యమని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నియంత్రణ అధికారిణి డాక్టర్ సిహెచ్ వి. భరత్ లక్ష్మి తెలిపారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అమలాపురంలో ఈరోజు 5 కే మారథాన్ రెడ్ రన్ ను ఆమె ప్రారంభించారు.

========================

ఉపరితల ఆవర్తనం దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాంధ్ర మీదుగా సగటు సముద్ర మట్టానికి 4.5 కిలో మీటర్ల  ఎత్తులో విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో రాష్ట్రంలో ఉత్తర కోస్తాంధ్రలో అనేక చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి నారాయణ వెలడిస్తూ..

(వాయిస్ 32 సెకన్లు)

========================

పురుషుల ఆసియా కప్ 2025 క్రికెట్ టోర్నమెంట్ మరి కొద్ది సేపట్లో యుఎఇ వేదికగా ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ రాత్రి 8 గంటలకు ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్ జట్ల మధ్య అబుదాబి వేదికగా జరగనుంది. ఇక భారత్ రేపు తన తొలి మ్యాచ్‌ను యూఏఈతో ఆడనుంది.

========================

========================